ఎయిరిండియాకు 1.10 కోట్ల జరిమానా

న్యూఢిల్లీ, జనవరి 24: భద్రతా నిబంధనలు ఉల్లంఘించిన ఎయిరిండియా సంస్థకు పౌర విమానయాన నియంత్రణ సంస్థ డీజీసీఏ రూ.1.10 కోట్ల జరిమానా విధించింది. అత్యవసర ఆక్సిజన్ సరఫరా వ్యవస్థ లేకుండానే బోయింగ్ 777 విమానాలను అమెరికాకు నడిపించిందని ఆరోపిస్తూ ఎయిరిండియా మాజీ పైలట్ ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై విచారణ జరిపిన డీజీసీఏ షోకాజ్ నోటీసులు ఇవ్వడంతో పాటు భారీ జరిమానా కూడా విధించింది. ఎయిరిండియాకు జరిమానా విధించడం వారంలోనే ఇది రెండోసారి.

చైనాలో అగ్ని ప్రమాదం.. 39 మంది మృతి

బీజింగ్: చైనాలోని జియాంగ్జి ప్రావిన్స్‌లో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. ఈ దుర్ఘటనలో 39 మంది ప్రాణాలు కోల్పోయారు. 9 మంది గాయపడ్డారు. జిన్యూ నగరంలో బుధవారం మధ్యాహ్నం 3.24 గంటల ప్రాంతంలో ఓ దుకాణాల సముదాయంలోని స్ట్రీట్ షాప్‌లో మంటలు ప్రారంభమయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ప్రమాదానికి గల కారణాలపై ఇంకా స్పష్టత రాలేదు.

అమెరికా, బ్రిటన్ మధ్య టీ చిచ్చు!

వాషింగ్టన్: వేడి వేడి టీ అద్భుతమైన రుచిగా ఉండాలంటే కాసింత ఉప్పు వేయాలని బ్రిన్ మావ్ కాలేజ్ కెమిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ మిషెల్లీ ఫ్రాంక్ ఇచ్చిన సలహా అమెరికా, బ్రిటన్ మధ్య వివాదాన్ని రేపింది. టీ బ్రిటన్ జాతీయ పానీయం కావడంతో ఆ దేశంతో సత్సంబంధాలు దెబ్బతింటాయేమోనని అమెరికా ఆందోళనకు గురైంది. వెంటనే లండన్‌లోని అమెరికన్ ఎంబసీ రంగంలోకి దిగింది. అమెరికన్ ప్రొఫెసర్ ఒకరు పర్ఫెక్ట్ టీ కోసం ఇచ్చిన సలహా బ్రిటన్‌తో తమకు గల ప్రత్యేక బంధాన్ని సల సల కాగుతున్న నీళ్లలో పడేసిందని వ్యాఖ్యానించింది. టీలో ఉప్పు కలపడం అమెరికా అధికారిక విధానం కాదని స్పష్టం చేసింది. టీని మైక్రోవేవింగ్ చేసి, సరైన రీతిలోనే తయారు చేస్తామని తెలిపింది.

విషాన్ని తింటున్నాం!

బియ్యం, గోధుమల్లో పోషకాలు మృగ్యం

30 శాతం మేర క్షీణించిన జింక్, ఐరన్ ● 1,493% పెరిగిన విష మూలకం ఆర్సెనిక్

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రిసెర్చ్ వెల్లడి ● ఆర్సెనిక్‌తో గుండె జబ్బులు, క్యాన్సర్ వచ్చే ప్రమాదం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 24 (నమస్తే తెలంగాణ): రోజూ మనం తింటున్న బియ్యం, గోధుమలు ఓ రకంగా విషపు ఆహారంగా మారిపోయాయి. శరీరానికి ఎంతో అవసరమైన జింక్, ఐరన్ వంటి పోషకాల స్థానంలో ఆర్సెనిక్ వంటి విష పదార్థాలు వచ్చి చేరడమే దీనికి కారణం. ఈ మేరకు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రిసెర్చ్ (ఐసీఏఆర్) పరిశోధకులు, 'డౌన్ టు ఎర్త్' మ్యాగజీన్ సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనంలో తేలింది. గడిచిన 50 ఏండ్ల వ్యవధిలో భారత్‌లో పండిస్తున్న బియ్యంలో జింక్ పోషకాలు 30 శాతం మేర తగ్గుముఖం పట్టగా, ఐరన్ పోషకాలు 27 శాతం మేర క్షీణించినట్టు అధ్యయనం తెలిపింది. గోధుమల్లో జింక్ స్థాయిలు 30 శాతం, ఐరన్ స్థాయిలు 19 శాతం మేర తగ్గినట్టు వెల్లడించింది. ఇదే సమయంలో ఆర్సెనిక్ మోతాదు బియ్యంలో ఏకంగా 1,493 శాతం పెరిగినట్టు పేర్కొంది. గోధుమల్లోనూ దాదాపుగా ఈ స్థాయిలోనే ఆర్సెనిక్ పెరుగుదల నమోదైనట్టు వివరించింది.

తక్కువ సమయం సాగుతోనే..

హరిత విప్లవంలో భాగంగా జనాభా పెరుగుదలకు అనుగుణంగా ఆహారోత్పత్తిని పెంచడంపై దృష్టిసారించిన శాస్త్రవేత్తలు.. తక్కువ సమయంలో ఎక్కువ దిగుబడినిచ్చే వినూత్న వంగడాలను తీసుకొచ్చారని అధ్యయనకారులు గుర్తు చేశారు. తక్కువ సమయంలో పంట చేతికి రావాలన్న రీతిలో సాగును ప్రోత్సహించడంతో భూమిలోని పోషకాలు మొక్కకు అందడంలో ఆటంకాలు ఏర్పడ్డాయని అభిప్రాయపడ్డారు. ఫలితంగా శరీరానికి అవసరమైన జింక్, ఐరన్ వంటి పోషకాలు వరి, గోధుమ పంటల్లో క్రమంగా క్షీణించాయని తెలిపారు. ఇదే సమయంలో కృత్రిమ ఎరువులు, అధికంగా క్రిమిసంహారకాలు వాడకంతో ఆర్సెనిక్ వంటి ప్రమాదకరమైన మూలకాలు చేరినట్టు వెల్లడించారు.

క్యాన్సర్, గుండె జబ్బులు

తినే ఆహారంలో పోషకాలు తగ్గితే శరీరంలో వ్యాధి నిరోధక శక్తి క్రమంగా క్షీణిస్తుంది. దీంతో రోగాలబారిన పడుతాం. శరీరంలో ఐరన్, జింక్ లోపం ఏర్పడితే రక్తహీనత, పెరుగుదల లోపం వంటి సమస్యలు ఏర్పడొచ్చు. తినే ఆహారంలో ఆర్సెనిక్ వంటి పదార్థాలు చేరితే, గుండె జబ్బులు, క్యాన్సర్, మధుమేహం, చర్మవ్యాధులు రావొచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

సామర్థ్యాన్ని కోల్పోయిన మొక్కలు

1980లో తక్కువ వ్యవధిలో అధిక దిగుబడులనిచ్చే వినూత్న వంగడాల వాడకం పెరిగింది. ఇదే సమయంలో చీడపీడలు, తెగుళ్ల నుంచి పంటను కాపాడుకోవడానికి క్రిమిసంహారకాల వాడకం కూడా ఎక్కువైంది. దీంతో నేలలోని పోషకాలను గ్రహించే సామర్థ్యాన్ని మొక్కలు క్రమంగా కోల్పోయాయి. ప్రస్తుత పరిస్థితికి ఇదీ ఓ కారణం.

- బిశ్వపతి మండల్, అధ్యయనకారుడు

పోషకాలు గ్రహించడంలో విఫలం

ప్రస్తుతం సాగు చేస్తున్న వంగడాలు భూమిలోని పోషకాలను గ్రహించడంలో వెనుకబడి ఉన్నట్టు మా పరిశోధనలో తేలింది.

- శోవన్, దేబ్‌నాథ్, ఐసీఏఆర్ శాస్త్రవేత్త

కూలిన రష్యా సైనిక విమానం

- **ఉక్రెయిన్ ఖైదీలు సహా 74 మంది దుర్మరణం**
- **ఉక్రెయిన్ సైన్యమే కూల్చేసిందన్న రష్యా**

మాస్కో, జనవరి 24: ఉక్రెయిన్ యుద్ధ ఖైదీలను తరలిస్తున్న రష్యా సైనిక విమానం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో 65 మంది ఉక్రెయిన్ యుద్ధ ఖైదీలు సహా, ఆరుగురు సిబ్బంది, మరో ముగ్గురు వ్యక్తులు మరణించారని రష్యా రక్షణశాఖ బుధవారం ప్రకటించింది. ప్రమాద ఘటన ఉక్రెయిన్ సరిహద్దు బెల్గోరాడ్‌లోని కోరోఛాన్స్కీ జిల్లాలో చోటుచేసుకుందని ఆ రాష్ట్ర గవర్నర్ వ్యాచిస్లేవ్ గ్లాడ్‌కోవ్ మీడియాకు తెలిపారు. ప్రమాదానికి దారి తీసిన కారణాలు ఆయన వెల్లడించలేదు. ఖైదీల మార్పిడిలో భాగంగా ఉక్రెయిన్ యుద్ధ ఖైదీలను బెల్గోరాడ్‌కు తరలిస్తుండగా విమానం ప్రమాదానికి గురైందని రష్యా అధికారులు చెబుతున్నారు. ఉక్రెయిన్ సైనిక బలగాలే తమ విమానాన్ని కూల్చేశాయని రష్యా రక్షణశాఖ ఆరోపించింది. ఉక్రెయిన్ ఆధీనంలోని ఖార్కీవ్ నుంచి బెల్గోరాడ్ ప్రాంతంపైకి రెండు క్షిపణుల్ని ఉక్రెయిన్ బలగాలు ప్రయోగించాయని, దాడులు జరిగినట్టు తమ రాడార్లు గుర్తించాయని రష్యా తెలిపింది. క్షిపణి దాడులను తీవ్రవాద చర్యగా పేర్కొన్నది.

ఖైదీల తరలింపు నిజమేనా!

కుప్పకూలిన విమానంలో యుద్ధ ఖైదీలున్నారన్న విషయాన్ని అంతర్జాతీయ మీడియా ఖరారు చేయలేదు. ఇరు దేశాల మధ్య యుద్ధ ఖైదీల మార్పిడి వంటిదేదీ లేదని ఉక్రెయిన్ అధికారిక వర్గాలు చెప్పటంతో, దుర్ఘటనపై రష్యా చేసిన ప్రకటన పలు అనుమానాలకు తావిచ్చింది. విమానం కూలిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రమాదానికి ముందు విమానం అదుపు తప్పి కిందకు పడిపోయినట్టు కనిపించింది. నేలను తాకే ముందు విమానం పెద్ద ఎత్తున మంటల్లో చిక్కుకుపోయింది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. 'ఈ ప్రాంతంలో ఉక్రెయిన్ క్షిపణి దాడులు జరపవచ్చు. పౌరులెవ్వరూ ఇండ్లల్లో నుంచి బయటకు రావొద్దు' అని బెల్గోరాడ్ గవర్నర్ వ్యాచిస్లేవ్ గ్లాడ్‌కోవ్ ప్రకటించిన కొద్ది గంటల్లో సైనిక విమానం కుప్పకూలటం సంచలనంగా మారింది.

మూడో ప్రపంచ యుద్ధం రావొచ్చు!

ఐరాస జనరల్ అసెంబ్లీ అధ్యక్షుడు ఫ్రాన్సిస్

న్యూఢిల్లీ: ఎర్ర సముద్రంలో వాణిజ్య నౌకలపై హౌతీ తిరుగుబాటుదారుల దాడులతో నెలకొన్న పరిస్థితి తీవ్ర ఆందోళనకరంగా ఉన్నదని ఐక్యరాజ్యసమితి సాధారణ అసెంబ్లీ అధ్యక్షుడు డెన్నిస్ ఫ్రాన్సిస్ అన్నారు. ఇది మరింత విస్తృతమయ్యే అవకాశం ఉన్నదని, మూడో ప్రపంచ యుద్ధం కూడా రావొచ్చని అభిప్రాయపడ్డారు. ఐదు రోజుల పర్యటనలో భాగంగా భారత్ వచ్చిన ఫ్రాన్సిస్ బుధవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ఎర్ర సముద్రంలో హౌతీల దాడులను మూడో పక్షం ప్రోత్సహిస్తున్నట్టుగా కనిపిస్తున్నదని, ఇది ప్రమాదకరని అన్నారు. పర్యటనలో భాగంగా భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌తో సమావేశమయ్యారు.నేటి భౌగోళిక రాజకీయ వాస్తవాలకు అనుగుణంగా భద్రతా మండలి ప్రస్తుత కూర్పు లేదని, దాన్ని సంస్కరించాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు.

మూడు ట్రక్కులు.. రెండు కార్లు ఢీ

- **నలుగురు దుర్మరణం**
- **తమిళనాడులో దుర్ఘటన**

చెన్నై, జనవరి 24: తమిళనాడు ధర్మపురి జిల్లాలోని తొప్పూర్ ఘాట్ రోడ్డు వద్ద బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. మూడు ట్రక్కులు.. రెండు కార్లు ఒకదానికి ఒకటి బలంగా ఢీకొన్నాయి. కారు రెండు ముక్కలై.. వంతెనపై నుంచి పడిపోయింది. అందులో ప్రయాణిస్తున్న నలుగురు దుర్మరణం చెందారు. మూడు వాహనాలకు నిప్పు అంటుకొని దగ్ధమయ్యాయి. కృష్ణగిరి నుంచి సేలం వెళ్తున్న ఓ ట్రక్ వేగంగా దూసుకొచ్చి వంతెనపై మరో ట్రక్కును ఢీకొనటం.. ఈ ఘోర ప్రమాదానికి దారితీసింది. దీంతో బెంగళూరు–సేలం జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది.

కోటాలో మరో నీట్ విద్యార్థి ఆత్మహత్య

కోటా: రాజస్థాన్‌లోని కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. నీట్‌కు ప్రిపేర్ అవుతున్న యూపీకి చెందిన విద్యార్థి మంగళవారం హాస్టల్‌లోని తన గదిలో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మోరదాబాద్ జిల్లాకు చెందిన మొహమ్మద్ జైద్ (19) రెండోసారి నీట్ కోసం కోచింగ్ తీసుకుంటున్నాడు. మంగళవారం సాయంత్రం నుంచి జైద్ హాస్టల్ గది నుంచి బయటకు రావడం లేదని, రాత్రి 10 గంటల ప్రాంతంలో హాస్టల్ వార్డెన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు గది తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా, విద్యార్థి ఫ్యాన్‌కు ఉరేసుకొని విగతజీవిగా కనిపించాడు. గదిలో ఎలాంటి సూసైడ్ నోటు లభించలేదని, కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. కోటాలో గత ఏడాది 26 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు.

ఇథనాల్ తో నరాలపై ప్రభావం

సీసీఎంబీ పరిశోధకుల వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 24 (నమస్తే తెలంగాణ): ఇథనాల్ మానవాళికి ప్రమాదకారిగా మారుతున్నది. శరీరాన్ని నియంత్రించే మెదడు పనితీరుపైనే ప్రభావం చూపుతుందని సెంటర్ ఫర్ సెల్యూలార్ అండ్ మాలిక్యూలార్ బయాలజీ(సీసీఎంబీ) పరిశోధనల్లో వెల్లడైంది. మద్యం, పర్‌ఫ్యూమ్స్, ప్లాస్టిక్, కాస్మోటిక్స్ వంటి ఇథనాల్ ఉండే ఉత్పత్తుల వినియోగం వల్ల ఎప్పటికైనా రోగాలను కొని తెచ్చుకున్నట్లేనని మరోసారి వెల్లడైంది. ఇథనాల్ వినియోగం వల్ల దీర్ఘకాలం పాటు కలిగే పరిమాణాలు, శరీరంలో మార్పులు, నాడీ వ్యవస్థ స్పందించే విధానంపై పరిశోధకులు అధ్యయనం చేశారు. ఎలుకలపై చేసిన అధ్యయనంలో ఇథనాల్ పరిణామం పెరిగిన కొద్ది నాడీ వ్యవస్థలో వచ్చిన మార్పులను రికార్డు చేశారు. ఇలా మెదడులోని చాలా భాగం స్పందించే గుణాన్ని కోల్పోతుందని, దీంతో జీవక్రియలు కూడా మందగించినట్లుగా గుర్తించారు. 48 గంటల్లోనే ఇథనాల్ అందించిన ఎలుకలు స్పందనలో మార్పులు చోటుచేసుకున్నట్లుగా, మెదడు పనితీరు, స్పందనలను నియంత్రించలేకపోయినట్లుగా తేల్చారు.